క్లుప్తంగా

విద్యార్థిని మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని కేడీ కాలనీ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని బిడ్డిక సీత మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, సీత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గంగారావు కోరారు. శుక్రవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు వెళ్లిన ఆయన విద్యార్థిని మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ విద్యార్థి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతినెలా పాఠశాలలో మెడికల్ క్యాంపు నిర్వహించి, విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు బి.అనీల్, ఎం.ఇండియా తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



రైతుతో మాట్లాడుతున్న రైతు సాధికార సంస్థ ప్రతినిధి అనూప్‌కుమార్, తదితరులు

సీతంపేట: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని రైతు సాధికార సంస్థ ప్రతినిధి అనూప్‌కుమార్ దేవ్ తెలిపారు. మండలంలోని దారిమల్లి, నౌగుడ, దిబ్బగూడ గ్రామాల్లో చేపడుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. ఏయే పంటలు వేయాలి, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ మువలయ్య., ఎంటీ బాలు పాల్గొన్నారు.

అభినందనలు



బాక్సింగ్ విజేతలకు అభినందిస్తున్న ప్రిన్స్‌పాల్, పీడీ, కోచ్‌లు

భామిని: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో భామిని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు అండర్-17 బాక్సింగ్ పోటీలలో విజేతలుగా నిలిచారు. దీంతో విద్యార్థులను ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అండర్ -17 విభాగంలో ఎస్.జ్ఞానేశ్వరి సిల్వర్ మెడల్, ఎం కే శాంతికుమారి బ్రాంజ్ మెడల్.. అండర్-14 విభాగంలో పి.సాయి గణేష్ బ్రాంజ్ మెడల్ పతకాలు సాధించారన్నారు. కార్యక్రమంలో పీడీ శివరాంప్రసాద్, కోచ్ కె. సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

తాళాలు వేయడం తగదు

భామిని: అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు వేయడం తగదని ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి అన్నారు. బత్తిలిలోని ఆరు కేంద్రాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. తాళాలు తీయించి పౌష్టికాహార నిల్వలను పరిశీలించి, అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ నిమ్మల గంగారావు, డబ్ల్యూపీసీ వమ్మరవిల్లి జయంతి, నేరడి కార్యదర్శి లోవ అనసూయ ఆధ్వర్యంలో కేంద్రాల తాళాలు తీయించారు. పౌష్టికాహారం అందించడానికి తగిన నిల్వలు లేవని గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించారు.

తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు

సీతంపేట: అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె నేపథ్యంలో లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ కె. గీతాంజలి తెలిపారు. ఏజెన్సీలోని పలు కేంద్రాలను మహిళా పోలీసులు, వలంటీర్లు, ఎస్‌హెచ్‌జీ సభ్యుల సహకారంతో శుక్రవారం తెరిపించారు. మెనూ ప్రకారం లబ్ధిదారులకు భోజనాలు అందించారు.

జూదరుల అరెస్ట్

పాలకొండ రూరల్: ప్రత్యేక పోలీస్ విభాగానికి అందిన సమాచారం మేరకు మండలంలోని విజయరాంపురం వద్ద శుక్రవారం నిర్వహించిన దాడుల్లో ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎన్.ప్రశాంత్ కుమార్ తెలిపారు. నిందితులు పరారుకాగా 8 ద్విచక్ర వాహనాలు, 19 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాలకు మేలు



కొమరాడ: పెదశాఖ సచివాలయం వద్ద వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమంతో గ్రామాలు జై జగన్, జై వైఎస్సార్ సీపీ నినాదాలతో హోరెత్తుతున్నాయి. ప్రభుత్వం చేసిన మేలు వివరించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ నేతలు శుక్రవారం ఇంటింటికీ వెళ్లి, నాలుగున్నరేళ్లుగా జగనన్న సర్కారు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డులు, పార్టీ జెండాలు ఆవిష్కరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాలకు మేలు అని, గతంలోని టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. మేలు జరిందంటేనే వచ్చే ఎన్నికల్లో ఓటేసి, గెలిపించాలని కోరారు. ఏ ఇంటికి వెళ్లినా, ఎవరినడిగినా జగనన్నే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటుండడం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతుండడం విశేషం. -సాక్షి నెట్‌వర్క్.



పాలకొండ రూరల్: అర్దలిలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనిల్‌కుమార్, తదితరులు



గుమ్మలక్ష్మీపురం: కుక్కిడిలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ దీనమయ్య, తదితరులు



గుమ్మలక్ష్మీపురం: సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని ఎంపీడీవో జి.పైడితల్లి ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆమె ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తున్న నేపథ్యంలో ఎక్కడా ఏ అంగన్‌వాడీ కేంద్రంలోనూ కార్యకలాపాలు ఆగకూడదన్నారు. యథావిధిగా కేంద్రాలు తెరిచి, లబ్ధిదారులు పౌష్టికాహార పదార్థాలు అందివ్వాలన్నారు. సచివాలయ సిబ్బందికి అప్పగించిన అంగన్‌వాడీ కేంద్రాల బాధ్యతలను చిత్తశుద్ధి, నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

• ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని పనుకువలస సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని సర్పంచ్ కోట మంజుభార్గవి నేతృత్వంలో శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాలుగున్నరేళ్లలో జగనన్న ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి అందించిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల కష్టాలను నేరుగా చూసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలకు కట్టుబడ్డారన్నారు. అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే పల్లె వాకిటికి పాలన తీసుకువచ్చారని చెప్పారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను రానున్న ఎన్నికల్లో మరోసారి దీవించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనిల్‌కుమార్, సర్పంచ్‌లు లోలుగు విశ్వేశ్వరరావు, శివ్వాల శ్రీనివాసరావు, రణస్థలం రామా రాంబాబు, దేవాది అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యులు కోట అజేయ కుమార్, మజ్జి నవీన్‌కుమార్, నల్లి శివప్రసాద్, వంజరాపు కొండలరావు, కనుముల సూర్యనారాయణ, కోట జనార్దనరావు, ఎంపీడీఓ డొంక త్రినాథులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, తదితరులు

విజ్ఞానం పెంచేందుకే ఎగ్జిబిషన్లు

• ఎంఈఓ శ్రీనివాస్

భామిని: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించగా... వివిధ పాఠశాలలకు చెందిన 24 సైన్స్ ప్రయోగాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఎ. శ్రీనివాస్ మాట్లాడుతూ, విజ్ఞానం పెంచేందుకే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మూడు ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి జిల్లా స్థాయి ప్రదర్శనకు పంపిస్తామన్నారు. ప్రిన్సిపాల్ ఆర్. శివకుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలని సూచించారు. గ్రూప్ విభాగంలో భామిని జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు ఎస్.పవన్, జి.కార్తికేయ..వ్యక్తిగత విభాగంలో బత్తిలి హైస్కూల్ విద్యార్థిని పి.సంతోషిణి.. ఉపాధ్యాయ కేటగిరిలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి బి.భానుచందర్ ప్రయోగాలను జిల్లాస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశామని చెప్పారు. న్యాయ నిర్ణేతలుగా సీతంపేట హెచ్‌ఎం వై.హేమసుందరరావు, జీజేసీ కెమిస్ట్రీ లెక్చరర్ కొంచాడ సత్యనారాయణ వ్యవహరించారు.



ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్, ప్రిన్స్‌పాల్ శివకుమార్

నేత్ర శస్త్రచికిత్సకు 15 మంది పయనం

కురుపాం: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి నేత్ర శస్త్రచికిత్స కోసం 15 మంది విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రికి శుక్రవారం పయనమయ్యారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల పరిధిలో నిర్వహించిన వైద్య శిబిరాల్లో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద నేత్ర వైద్య తనిఖీలు చేయగా, కంటి ఆపరేషన్లకు వీరంతా ఎంపికయ్యారని పార్వతీపురం మన్యం జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. వీరందరికీ ఉచితంగా ఆపరేషన్ చేయడంతో పాటు రవాణా, వసతి, భోజనం, కళ్లద్దాలు, మందులు కూడా ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.



ఆస్పత్రికి బయలుదేరుతున్న రోగులు

విధులకు ఆటంకపరచడం సరికాదు

భామిని: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు సమ్మెను న్యాయబద్ధంగా చేసుకోవచ్చు కాని విధులకు ఆటంకపరచరాదని ఎంపీడీఓ జె. ఉమామహేశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మెలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, కేంద్రాలకు తాళాలు వేయవద్దని సూచించారు. వెంటనే తాళాలను వీఓఏలు, ఎస్‌హెచ్‌జీలకు అప్పగించాలన్నారు.

సైన్స్ ప్రదర్శనలతో ఉజ్వల భవిత

వీరఘట్టం: విద్యార్థుల ఉజ్వల భవితకు సైన్స్ ప్రదర్శనలు దోహదపడతాయని ఎంఈఓలు ఆర్.ఆనందరావు, డి.గౌరినాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. 13 పాఠశాలలకు చెందిన విద్యార్థులు 33 ప్రాజెక్టులు ప్రదర్శించారు. కార్యక్రమంలో జీజేసీ ప్రిన్సిపాల్ ఎం.కుమారస్వామి, ప్రధానోపాధ్యాయురాలు పి. సుధారాణి, ఉపాధ్యాయులు జి.లక్ష్మణరావు, ఎస్.సతీష్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘనంగా నివాళులు

సీతంపేట: ఐటీడీఏ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటానికి పీఓ కల్పనాకుమారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉక్కుమనిషి సర్దార్ వల్లబాయ్‌పటేల్, అమరజీవి పొట్టి శ్రీరాముల కు నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎ.లిల్లీరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు చేద్దాం..

పాలకొండ రూరల్: విద్యుత్ పొదుపు చేద్దామని ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి పిలుపునిచ్చారు. విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా తమ సిబ్బందితో కలసి పట్టణంలో శుక్రవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ పొదుపు చేసేక్రమంలో వినియోగదారులు తీసుకోవాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు. అనంతరం పొదుపుపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఈఈ మోహన్‌చక్రవర్తి, ఏఈఈ ఎస్.శ్యామ్‌సుందర్, ఎం.కేశవరావు, సత్తియ్య, దుర్గారావు, తదితరలు పాల్గొన్నారు.

నేడు నర్సిపురంలో 'గడప గడపకు..'

వీరఘట్టం: మండలంలోని సంత - నర్సిపురంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి క్యాంపు కార్యాలయం ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వశాఖల అధికారులు విధిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

అంకితభావంతో మెలగాలి

పాలకొండ రూరల్: దివ్యాంగుల పట్ల ఉపాధ్యాయులు, సంరక్షకులు అంకితభావంతో వ్యవహరించి వారి అభ్యున్నతికి కృషి చేయాలని డిప్యూటీ డీఈఓ పి. కృష్ణమూర్తి అన్నారు. జాతీయ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవిత కేంద్రంలోని చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐఆర్‌పీలు సత్యనారాయణ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి బహుమతి అందిస్తున్న డిప్యూటీ డీఈఓ కృష్ణమూర్తి

సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయండి

పాలకొండ రూరల్: గృహ లబ్ధిదారులు నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ మాధవరావు అన్నారు. శుక్రవారం స్థానిక జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1300 మందికి పైగా లబ్ధిదారులకు స్థలాలు కేటాయించినట్లు చెప్పారు. కాలనీలో అన్ని వసతులు కల్పించిన నేపథ్యంలో నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. సకాలంలో నిర్మాణాలు పూర్తిచేసి గృహప్రవేశాలు చేసిన వారిని అభినందించారు.



జగనన్న కాలనీలో గృహ యజమానుల నుంచి వివరాలు సేకరిస్తున్న హౌసింగ్ ఏఈ, తదితరులు

ధాన్యం వెంటనే అన్‌లోడ్ చేయాలి

• ఆర్డీఓ లావణ్య

పాలకొండ: ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి వెళ్లిన ధాన్యం లోడులను వెంటనే అన్‌లోడ్ చేయాలని ఆర్డీఓ లావణ్య ఆదేశించారు. మండలంలోని అంపిలిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తుమరాడ మారుతి రైస్‌మిల్లు వద్ద రెండు రోజులుగా ధాన్యం లోడులు అన్‌లోడ్ చేయలేదని రైతులు వివరించారు. దీంతో ఆమె వెంటనే మిల్లరుతో మాట్లాడి వెంటనే ధాన్యం అన్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి అనుసంధానమైన వాహనాలు విధిగా జీపీఎస్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు.



అంపిలి ధాన్యం కొనుగోలు కేంద్రంలో వివరాలు పరిశీలిస్తున్న ఆర్డీఓ లావణ్య

పాలకొండలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సేవలు

పాలకొండ: నగర పంచాయతీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సేవలు అందుబాటులోనికి వచ్చాయి. స్థానిక రాజాం రహదారిలో ఏర్పాటుచేసిన బ్రాంచ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్, సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి, ఆర్డీఓ లావణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, సర్పంచ్‌ల సంఘ మండల అధ్యక్షుడు లొలుగు విశ్వేశ్వరరావు, సర్పంచ్ గవర రాజశేఖర్, మజ్జి నవీన్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి



గరుగుబిల్లి: ప్రాజెక్టు పనితీరును వివరిస్తున్న విద్యార్థులు



కొమరాడ: విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈవో నారాయణస్వామి

కొమరాడ: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని ఎంఈవో-1 జామి నారాయణస్వామి సూచించారు. శుక్రవారం మండలంలోని బాలురు గురుకుల పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి విజ్ఞాన ప్రదర్శనను ఆయన శుక్రవారం సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులను చూసి, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుందని, దానిని గుర్తించి, ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆ దిశగా ప్రయత్నాలు చేయాలన్నారు. దళాయిపేటకు చెందిన విద్యార్థులు డి.గౌతమ్, జి.దుర్గాప్రసాద్‌లతో పాటు లక్ష్మీప్రసాద్ రూపొందించిన ప్రాజెక్టులు జిల్లా స్థాయి ప్రదర్శనలకు ఎంపిక చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 తిరుపతిరావు, పిన్సిపాల్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి విజ్ఞాన ప్రదర్శనను ఎంఈవో ఎస్.నాగభూషణరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల రూపొందించిన ప్రాజెక్టుల వద్దకు వెళ్లి, వాటి రూపకల్పన, పనితీరుపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఇక్కడ ఎంపికైన అత్యుత్తమ ప్రాజెక్టులు జిల్లా స్థాయిలో జరిగే విజ్ఞాన ప్రదర్శనలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు

• జేసీ ఆర్.గోవిందరావు

గరుగుబిల్లి: రైతులకు ఇబ్బంది కలిగించకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని జేసీ(జాయింట్ కలెక్టర్) ఆర్.గోవిందరావు ఆదేశించారు. మండలంలోని నాగూరు గ్రామంలో రైస్‌మిల్లులకు తరలిస్తున్న ధాన్యంబస్తాలను శుక్రవారం పరిశీలించిన ఆయన చేతులమీదుగా రైతుకు ట్రక్ షీటు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతోందని, రైతులు దళారులను ఆశ్రయించి, మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని, అన్నదాతలెవరూ ఆందోళన చెందవద్దన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఏవైనా సమస్యలు తలెత్తితే టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు.



రైతుకు ట్రక్ షీట్‌ను అందజేస్తున్న జేసీ గోవిందరావు

హిందూ ధార్మిక సమ్మేళనం ర్యాలీ



ర్యాలీలో శ్రీనివాసానంద సరస్వతి స్వామి

కురుపాం: మండల కేంద్రంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ ధార్మిక సమ్మేళనం ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. నీలకంఠేశ్వరస్వామి ఆలయం నుంచి గాయత్రిమాత ఆలయం వరకు కొనసాగిన ఈ ర్యాలీలో ముఖ్య అతిథిగా శ్రీనివాసానంద సరస్వతి స్వామి హాజరై, హైందవ ధర్మం గొప్పతనం వివరించారు. అనంతరం ఆయనను నిర్వాహకులు సన్మానించారు. నిర్వాహకులు గుడ్ల నగేష్, నడుకూరు ధూళికేశ్వరరావు, బోటు అనీల్, మద్ది సుధాకర్, ముత్తా సూర్యనారాయణ మాట్లాడుతూ జానపద ప్రాచీన కళలు, సనాతన సంస్కృతి, సంప్రదాయాలు కాపాడేందుకు సమరసత సేవా ఫౌండేషన్ విశేష కృషి చేస్తోందన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

గరుగుబిల్లి: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌరీశంకరరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పథకం పనుల ద్వారా ప్రతీ గ్రామంలోని ప్రతీ ఇంటికి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. మండలంలోని లఖనాపురం గ్రామంలో అదనపు పైపులైన్ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయన్నారు. రానున్న వేసవి దృష్ట్యా ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు.